కథా నిలయం
3962
శ్రీకాకుళం

# దొర మల్లా వచ్చిండు

"దొర మల్లా వూర్లెకచ్చిండు. పదహేడేళ్ల తర్వాత దొర వూర్లెకడుగు పెట్టిండు" వూరంతా ఏదో విచిత్రం జరిగినట్టూ... అందరిలోనూ విస్మయం.

"నక్సలైట్ల భయానికి పట్నం పారిపోయిన దొర ఇన్నేళ్ళకు మల్లా వూర్లెకచ్చిండు. మందలించి వద్దాం".

వూరు కదిలింది.

"ఇంతకీ దొర ఎక్కడున్నాడ్రా?"

"వాళ్ళ బావమరిదింటికి వచ్చిండట. గఢీ ఎప్పుడో పాడువడే"

"దొర వచ్చిండని తెలిస్తే... నక్సలైట్లు వత్తరేమో?"

"అళ్లొస్తే పోలీసుల్తో పీకులాట. ఊరు వల్లకాడైతది"

"దొరతోని నలుగురు పోలీసోల్లు కాపలా గచ్చిండ్రట. ఏంకాదు. పొద్దు గూకంగనే మల్లపట్నం బోతడట"

"అయినా దొరని చూసొద్దాం పద"

ఆడమగా, పరిచితులు, అపరిచితులు అంతా పరమేశ్వర్‌రావ్ దొరని చూడటానికి బయల్దేరారు.

అందరూ హడావిడిగా వెల్తుంటే... అరవై ఏళ్ళ మొగిలయ్య మనసు ఎక్కడికోపోయింది. దొరతనం గుర్తొచ్చి ముసలి శరీరం వణికిపోయింది.

పరమేశ్వర్రావ్ దొర...

ఒకప్పుడు ఈ పల్లె శ్రమని గొట్టంతో షర్బత్ పీల్చినంత తేలిగ్గా పీల్చినవాడు. పదహారేళ్ళనించే దొర పెత్తనం మొదలెట్టి దాదాపు పాతికేళ్ళు సాగించిన అకృత్యాలు... గఢీల నించి బయటికి కొద్దిగా పొక్కినా తన, తను కొడుకు ఎన్నింటికో మూగసాక్షులై మిగిలిపోయారు.

కొన్ని దారుణాలు చూసి తను పట్టించుకోకపోయినా పదిహేడేళ్ల తన కొడుకు రాజేందర్‌కు రక్తం సలసలా మరిగిపోయేది.

ఇంటికొచ్చి తల్లితో చెప్పుకొనేవాడు.

గఢీలో జరిగిన అత్యాచారాలు...

గఢీలో జరిగిన హత్యలు...

గఢీలో జరిగిన పంచాయతీలు... అన్నీ చూస్తుంటే నెత్తుటితో తడిసిన తాజ్‌మహల్‌లాగా కన్పిస్తుందిని పద్యాలు రాసుకునేటోడు.

గఢీలో ఎన్నో చూసినవాడు... ఇంట్లోంచి మాయమైపోయాడు. కడుపుతీపితో కన్నపేగులు చించుకొని భోరున ఏడ్చాం. ఆర్నెల్ల తర్వాత వాడు అన్నల్లల్ల కల్సిండని తెలిసాక భయపడ్డాం. కానీ... అనుకున్నంత జరిగింది. వాడు దళంతో గడి మీదికి దండెత్తాడు. దొరని చంపాలని కాల్పులు జరిపాడు.

కాని... పరమేశ్వర్రావ్ తప్పించుకొని పట్నం పారిపోయాడు.

ఆర్నెల్లలో మరో రెండుసార్లు వూర్లోకి వచ్చిండని తెల్సి మళ్ళీ దాడి చేసాడు. మళ్లీ తప్పించుకొని ఇక పట్నంలోనే వుండిపోయాడు. భూముల్లో జెండాలు పాతినప్పటికీ అక్కన్నించే భూముల్ని అమ్మకానికి పెట్టాడు.

దొర పోయింతర్వాత... వూరు ప్రశాంతమైందని వూరంతా తన కొడుకుని పొగిడారు. రాజేందర్ పుణ్యమాని మంచిగ బతుకుతున్నమని వీళ్లంతా తనతో అంటుంటే గర్వంగా పొంగిపోయేవాడు. ఈలోగా తన కొడుకు ఎన్‌కౌంటర్లో చచ్చిపోయాడు. నక్సలైట్లల్లో కల్సినప్పుడు ఏడ్చినంతగా కూడా ఏడ్పు రాలేదు. ఎందుకంటే వాడు చావుకి సిద్దపడే పోయాడని రోజూ అనుకునేవాళ్ళం కాబట్టి.

కాలక్రమంలో రాజేందర్ పేరుని వూరు మర్చిపోయింది. దొరని కూడా దాదాపు మర్చిపోయారు.

అటువంటిది... 'దొర మల్లా వచ్చిండు'. అని వూరంతా చూడ్డానికి పరిగెడుతున్నారు. మొగిలయ్య నులకమంచంలో కూచొని చుట్ట తాగుతూ వచ్చిపోయే వాళ్ల మాటలే వింటున్నాడు.

"దొర ఎంత మంచోడు. ఎంత ప్రేమగా మాట్లాడిండు"

"మునుపటి దొర కాదు. ఇంకా అందర్నీ యాదికి పెట్టుకున్నడు. చచ్చిపోయినోళ్ళను కూడా యాజ్జేసిండు"

''నువ్వు పోశిగాని కొడుకువ్ గదా అని నన్ను దగ్గరికి తీస్కున్నడు. దొరకాళ్లకి మొక్కాలన్పించింది''

''దొరది పెద్ద మనసు. గధీ మొత్తం బడికి రాసిచ్చిండు''

''ఎందుకో అందర్నీ చూడబుద్ధయి వచ్చిన్నని జెప్పిండు. పూర్ని జాసినంక దుఃఖంమాగలేదట. అందరికి దూరమైతి అని బాధపడ్డడు''

మొగిలయ్యకి జనం మాటలు ఆశ్చర్యాన్ని గొలిపాయి.

''దొరది పాడుపడ్డ పశువుల దొడ్డి కూడా మంచిగ జేయిస్తనన్నడు. దాన్ని కమ్యూనిటీ హాల్‌గా వాడుకొమ్మన్నడు''

''గట్లనే... చెరువు కింది భూముల్ల చాకలోల్లను దోబీలు కట్టుకోమన్నడు''

''ఒక్కసారిగ దేవుని లెక్కచ్చి... వరాలిచ్చి పోవట్టె. ఇంక వూర్లెనే వుంటె ఎంత మంచిగజేసెటోడో...''

''రాజేందరనేటోడు నక్సలైటల్ల కల్సి మననోట్లె మన్నుగొట్టిండు. దొర ఎంత మంచోడో ఇప్పుడు దెల్వలేదా?''

మొగిలయ్య గుండె మీద గుండు సూదులు గుచ్చుతున్నయ్. మాట్లాడేవాళ్ళంతా ఈ తరం వాళ్లు. అయినా మారిపోయిన దొరని తనకీ ఒకసారి చూడాలనిపించింది. తర్వాత మనసు వద్దంది. అయినా చూసొస్తే తప్పేంటి అని నులక మంచంలోంచి లేచి కట్టె తీసుకొని అడుగులో అడుగేసుకుంటూ పోయాడు. దొర బామ్మర్దింటి నిండా వూరి జనం. లోపలికి వెళ్లాలన్నా సందు లేదు.

''ఈడి కొడుకు చెయ్యంగనే దొర వూరిడిసిపెట్టిండు'' ఎవరో అన్నారు. రోజూ చూసేవాళ్ళయినా అప్పుడు మొగిలయ్యని విచిత్రంగా చూసారు. అందరి మధ్యలోంచి మెల్లిగా సందుజేసుకొని లోపలికెళ్ళాడు మొగిలయ్య.

నిండుగా... భారీ విగ్రహంతో... వయసు తెచ్చిపెట్టిన పెద్దరికంతో మసకమసగ్గా కన్పించాడు పరమేశ్వర్రావ్. మొగిలయ్యని చూడగానే గుర్తు పట్టాడు. కుర్చీలోంచి లేచొచ్చి...

''అరరే... మాదిగి మొగిలయ్య కదూ... మొగిలీ... మంచిగున్నవా... నన్ను చిన్నప్పుడు ఎత్తుకొని తిరిగెటోనివి. యాదికుందా'' అంటూ దగ్గర తీస్కున్నాడు.

మొగిలయ్య కన్నా ముందు చుట్టూ వున్న జనం ఉబ్బితబ్బిబ్బయ్యారు.

''మంచగనే వున్ననయ్యా... మీరు మంచిగున్నరా?'' అన్నాడు మొగిలయ్య.

''మంచిగనే వున్న మొగిలీ... అన్నట్టు రాజేందర్‌గాన్ని పోలీసోల్లు చంపిండ్రని తెల్సింది. గీ వయసుల ఆడు నీకు లేనిపొని కష్టంబెట్టె. కండ్లు మంచిగ కనవడుతున్నయా... ఇగో మొగిలీ... చిన్నప్పుడు నీ చేతుల్ల పెరిగినోన్ని. నన్ను కొడుకు లెక్కను కొని ఓసారి పట్టుంరా.

కండ్ల డాక్టర్‌కు జూపిత్త'' ప్రేమగా చెప్పాడు పరమేశ్వర్రావ్.

''గట్లనే దొర...'' మొగిలయ్యకి కూడా దొర బాగా మారిపోయాడనిపించింది.

పరమేశ్వర్రావ్ వాళ్ళ బామ్మర్దిని పిలిచి ఎల్లుండి మొగిలిని సిటీకి తీసుకురమ్మని అందరిముందూ చెప్పాడు.

''నీకొడుకు చంపుటానికి పోయినా కూడా దొర నిన్ను దగ్గర తీసిండ్రా మొగిలీ. దొర మునుపటి దొర కాదు'' అన్నారు ఒకరిద్దరు.

ఇంకా ఎవరెవరో రావటంతో పరమేశ్వర్రావ్ మాటల్లో పడిపోయి... సాయంత్రం కాగానే హడావిడిగా వెళ్లిపోయాడు. పోతూపోతూ అయిదువేలు కులపెద్దలకిచ్చి వెళ్లాడు. జల్సా చేసుకొమ్మని.

వూరంతా ఆనందంతో నిండిపోయింది.

*　　　*　　　*　　　*

మనవడి సాయంతో పట్నం చేరిన మొగిలయ్యని పెద్ద హాస్పిటల్‌లో చేర్చారు. పరమేశ్వర్రావ్ బామ్మర్ది జాయిన్ చేసి వెళ్ళాడు. అంత పెద్ద హాస్పిటల్ దొరదేనని తెల్సిన మొగిలయ్య ఆశ్చర్యపోయాడు. దొర ఇల్లు, కార్లు, అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు అన్నీ చూసాక మొగిలయ్య తల తిరిగిపోయింది. సిటీకి పోయినంక దొర కన్పించలేదు. కాని డాక్టర్లు ఆపరేషన్ తర్వాత రెండోరోజున కళ్ళకు కట్టిన కట్లు విప్పారు. మొగిలయ్యకి పరమేశ్వర్రావ్ ఆస్తులు ఇప్పుడు మరింత స్పష్టంగా కన్పించాయి.

డిశ్చార్జి అయ్యేరోజున అకస్మాత్తుగా వచ్చాడు పరమేశ్వర్రావ్.

మొగిలయ్య దండం పెట్టాడు.

పరమేశ్వర్రావ్ ఆ చేతుల్ని పట్టుకొని ''నీ కొడుకు నాకు గొప్ప పని చేసాడ్రా. వాడే గనక మరో పదేళ్లముందు నన్ను పట్నాలకు పారిపొయ్యేలా చేసుంటే ఈ సిటీనే కొనేసివుండేవాడ్ని.

పట్నం వచ్చాక పైసల్ని పదింతలు చేయటం ఎలాగో తెల్సింది. తెలివి పెరిగింది. లౌక్యం తెల్సింది. ఇక్కడ ప్లాట్ల బిజినెస్ చేసాను. బాగా సంపాదించాను. నేనే కాదు. నాలాంటి దొరలంతా పల్లెలు వదిలాక పారిశ్రామికవేత్తలయ్యారు. ఎవన్ కాంట్రాక్టర్లయ్యారు. కాలేజీలకు, హాస్పిటల్లకు ఓనర్లయ్యారు. ఆనాటి భూస్వామ్య వర్గమంతా ఈనాడు పారిశ్రామిక మాజమాన్యంగా మారిందంతే. విప్లవం వర్ధిల్లాలని పట్నాల్లో దొరలు పూజలు చేసాద్రా. విప్లవం అంటే మాకు ప్రేమరా. అందుకే రాజేందర్ గాడు అప్పుడప్పుడు మనసులో మెదుల్తుంటాడు. అవునూ... నీకిప్పుడు కళ్ళు బాగా కన్పిస్తున్నాయా అన్నాడు ప్రేమగా మొగిలయ్య కళ్ళజోడుని సవరిస్తూ.

''మంచిగా కనపడుతున్నయ్ దొ...రా...'' అని మొగిలయ్య మనవడి అసరాతో వెళ్ళిపోవడానికి సిద్ధమవుతుంటె.

"మొగిలీ... నయాపైస కూడా ఈ దవాఖాండ్ల నువ్వు కట్టేది లేదు. మంచిగ తిను. ఖర్చులకు ఈ అయిదువందలుంచు" అని బలవంతంగా డబ్బుని మొగిలయ్య చేతుల్లోవుంచాడు.

మొగిలయ్య మనవడు దొరవైపు ఆరాధనాపూర్వకంగా చూసాడు. వాళ్లు వెళ్లిపోబోతుంటే...

"మొగిలీ..." అన్నాడు అనునయంగా.

"నువ్వు వూర్లెబోయినంక ఇప్పట్నించి నాగురించి చెప్పాలె. ఊరంత ఒకటి చెయ్యాలె. ఇంక ఏడెనిమిది నెల్లల్ల ఎలక్షన్లు వస్తున్నయ్. ఈసారి ఎమ్మెల్యే టిక్కెట్ నాకే వచ్చేటట్టుంది. మనూర్లె నుంచి ఒక్క ఓటు కూడా వేరోటోనికి పోవద్దు. నువ్వు కాపాడాలె..." అన్నాడు దగ్గర తీసుకుంటూ.

"మంచిది దొర" అన్నాడు పరమేశ్వర్రావ్ అంతరంగం అర్థమై.

"ఏమోయ్. మనూర్లె నువ్వే యువనాయకుడివి. ఎలక్షన్లో బాగా తిరగాల. మీ తాతని జాగర్తగా దీస్కపో..." అన్నాడు మొగిలయ్య మనవడితో.

వాడిలో కృతజ్ఞతాభావం ఎవరెస్టు శిఖరంలా ఎదిగిపోయింది.

దొర వెళ్లిపోయాడు.

బస్టాండ్‌కి వచ్చాక మొగిలయ్యని మనవడడిగాడు.

"తాతా... కళ్లద్దాలు పెట్టుకున్నాక చూపు బాగా ఆనుతుందా?"

" ఈ వెలుతురు భరించలేకపోతున్నా బిడ్డా. నాకీ అద్దాలొద్దు. ఆ గుడ్డితనమే కావాలనిపిస్తోందిరా..." మొగిలయ్య కంఠంలో ఏదో జీర.

"దొర గంత మంచిగ ఆపరేషన్‌జేయిస్తే... గట్లనవడ్తివేందే"

"నీకర్థంగాదు బిడ్డా. దొర మారలేదు. రంగు మార్చిండు గంతే" అన్నాడు మొగిలయ్య.

అంతలోకే బస్సొచ్చింది.

ఇద్దరూ జనాన్ని తోసుకుంటూ బస్సెక్కారు.

పావుగంట తర్వాత బస్సు కదిలింది.

మనవడు చూడకుండా... మొగిలయ్య నెమ్మదిగా కళ్ళద్దాలు తీసి బస్ కిటికీలోంచి జార విడిచాడు.

అవి బస్ టైర్ల పడి నలిగిపోయాయి. మొగిలయ్య కళ్లల్లో కింద వెనక మళ్లీ మసక చీకటి అలుముకుంది.

అయినా ఆ కళ్లనిండా ఏదో తృప్తి!!